క్లుప్తంగా

ఎడతెరిపిలేని వర్షం

అశ్వారావుపేటరూరల్: ఎడతెరిలేకుండా రోజంతా వర్షం కురవడంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. సోమవారం రాత్రి నుంచి మొదలైన వర్షం మంగళవారం రాత్రి వరకు కురుస్తునే ఉంది. జోరుగా కురిసిన వర్షంతో 3 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది. జోరు వర్షంతో జనజీవనం స్తంభించగా, ప్రధాన రహదారులన్నీ వెలవెలబోయాయి. కాగా జోరు వర్షంతో చెరువుల్లోకి వరదనీరు చేరగా, కొద్ది రోజుల క్రితం వేసిన వరినారుకు ప్రాణం పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లు కేటాయించాలని వినతి

చర్ల: రామారావుపేట ఎంపీటీసీ స్థానం పరిధిలో అర్హులైన పేదలందరికీ డబుల్‌బెడ్రూమ్ ఇళ్లను కేటాయించాలని కోరుతూ కోరుతూ రామారావుపేట ఎంపీటీసీ సభ్యుడు ఎలమంచి వంశీకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం దుమ్ముగూడెం ఎంపీడీఓ ముత్యాలరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ వంశీకృష్ణ మాట్లాడుతూ.. తన పరిధిలో ఉన్న మూడు గ్రామపంచాయతీల్లో నేటికీ ఒక్క డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు కూడా ఇవ్వలేదని అన్నారు. కార్యక్రమంలో సోడి లక్ష్మి, సోడి రమణ, సోడి రాజమ్మ, కారం వెంకటమ్మ, సోడి మంగమ్మ, సోడి వరలక్ష్మి, కారం నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోడు పట్టాలు ఇవ్వాలని..

అన్నపురెడ్డిపల్లి: పోడు సాగుదారులందరికి పట్టాలు మంజూరు చేయాలని కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భద్రకాళికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాణావత్ భీముడు, సుభాని, రాంచందర్, చల్లా పుల్లయ్య, ముద్రగడ వెంకటేశ్వర్లు, చల్లా రమేష్, భూక్యా చెన్నారావు పాల్గొన్నారు.

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని సింగవరం గ్రామపంచాయతీ పరిధిలోన సింగవరం, ఎస్ లక్ష్మీపురం గ్రామాలకు చెందిన గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏవీఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూపా సీతయ్య ఆధ్వర్యంలో మంగళవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏవీఎస్‌పీ నాయకులు వరసా వెంకటేశ్, వరసా కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ వరసా తిరుపతమ్మ, గ్రామస్తులు పద్మ, పాయం లక్ష్మి, నూపా సత్యనారాయణ, వరసా పాపారావు పాల్గొన్నారు.

గుంతలను పూడ్చాలి

ములకలపల్లి: ములకలపల్లి-పాల్వంచ ఆర్ అండ్‌బీ రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను వెంటనే పూడ్చాలని జెడ్పీటీసీ సున్నం నాగమణి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ శాఖ డీఈ శ్రీనివాసరావుతో మంగళవారం ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. ప్రధానం మార్కెట్ యార్డు సమీపంలోని బ్రిడ్జివద్ద, పూసుగూడెం శివారులోని వంతెన వద్ద గోతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జయప్రదం చేయండి

చంద్రుగొండ: పాతపెన్షన్ విధానం సాధన కోసం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సంకల్ప రథయాత్రను జయప్రదం చేయాల్సిందిగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ మండల అధ్యక్షుడు ఏ.దేవరామ్ పిలుపునిచ్చారు. యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం మండల విద్యాశాఖాధికారి సత్తెనపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. నేడు జిల్లా కేంద్రం కొత్తగూడెంకు యాత్ర చేసుకుంటుందని, ఈ సందర్భంగా ధర్నా చౌక్ వద్ద బహిరంగసభ ఉంటుందని తెలిపారు. నాయకులు యం.వెంకటేశ్వర్లు, బి.రవి, సేవ్య, నర్సింహారావు, యం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మిక గర్జన..

మణుగూరురూరల్: కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. ఇఫ్టూ ఆధ్వర్యంలో ఆగస్టు 4న తలపెట్టిన కార్మిక గర్జనను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా నాయకుడు ఎండి.గౌస్ కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. మంగళవారం మణుగూరు ఏరియాలోని పలు విభాగాల్లో పర్యటించి కార్మిక గర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రజాపంథా నాయకులు కాంపాటి జీవన్, కార్మికులు కృష్ణ, టి.వెంకటేశ్వర్లు, రాము, శంకర్, రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

మణుగూరురూరల్: వర్షాకాల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణ జాగ్రత్తలపై కార్మికులకు, వారి కుటుంబాలకు అవగాహన కల్పిచాలని ఇఫ్టూ అనుబంధ జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డి.నాసర్‌పాషా విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఈ మేరకు మణుగూరు సింగరేణి ఏరియా ఆస్పత్రి డీవైసీఎంఓ డాక్టర్ మేరికుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాసర్‌పాషా మాట్లాడారు. మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భద్రాచలంటౌన్: పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్‌లో పాటు పీఆర్‌సీ వాయిదాలు, ఎరియల్స్ బిల్లులు వెంటనే చెల్లించి విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

పల్లెలకూ పట్టణాలే 'ఆధార్'ం

- కిలోమీటర్ల మేర ప్రయాణం
- రోజుల కొద్ది ప్రదక్షిణలు.. గంటల తరబడి పడిగాపులు
- స్థానికంగా ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో దుస్థితి



ఆధార్ సర్వీస్ లేని స్థానిక మీ సేవా కేంద్రం..

గుండాల: ఏజెన్సీ ప్రాంతాలైన గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో ఆధార్ సర్వీసులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మీసేవా కేంద్రాల్లో ఉన్న సర్వీసులను నిలిపివేయడంతో ఇక్కడి ప్రజలు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్టణాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ వందల సంఖ్యలో జనం క్యూలో ఉండడంతో రోజుల తరబడి పడిగాపులు, ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్న జిల్లా అధికారులు ఇంతవరకు ఎలాంటి ఏర్పాట్లూ లేకపోవడం నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఆధార్ అప్‌డేట్ చేసేందుకు, తప్పుగా పడిన పేర్లను, వయస్సును మార్పులు చేయించుకోవడం, ఫోన్ నంబర్ లింక్ చేయడం, అడ్రస్‌ల మార్పులు, నూతన వధువుల ఇంటి పేర్లు మార్చుకోసం ఇంకా తదితర మార్పులు, చేర్పుల కోసం గుండాల, ఆళ్లపల్లి మండల వాసులు ఇల్లెందుకు వెళ్లాల్సి వస్తోంది. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో విద్యార్థుల కోసం ఆధార్ సర్వీస్ నడుస్తున్నప్పటికీ పెద్దలు మాత్రం పట్టణాలకు వెళ్లాల్సిందే. ప్రతీ సంక్షేమ పథకాలకు, పింఛన్లకు, కల్యాణలక్ష్మి పొందేందుకు, బ్యాంకులో ఖాతాలు తెరిచేందుకు తదితర అవసరాలకు ఆధార్ తప్పనిసరి అయినప్పుడు ఇక్కడి ప్రజలు పడుతున్న బాధలు వర్ణణాతీతం. ప్రత్యేకంగా ఈ పనిపైనే ఇల్లెందు వెళ్లినప్పటికీ అక్కడ వందల సంఖ్యలో జనం క్యూలో ఉంటున్నారు. దీంతో రోజంతా అక్కడే ఉండాల్సిన వస్తోంది. కొంతమంది పనికాకపోతే మరో రోజు.. ఆపై ఇంకో రోజు.. ఇలా రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది. వృద్ధులు, వికలాంగుల పరిస్థితి ఇంకా దారుణం. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆధార్ సర్వీసులు ఏర్పాటు చేస్తామంటున్న అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం పనుల కాలం కావడంతో ఇబ్బందులు ఇంకా ఎక్కువవుతుంటాయని ప్రజలంటున్నారు. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో ఇప్పటికైనా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

మండలంలోనే ఏర్పాట్లు చేయాలి

మండలంలో ఆధార్ సెంటర్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. చెట్టుపల్లి నుంచి ఇల్లెందు తిరగాల్సి వస్తోంది. ఏదైనా పని కోసం మండల కేంద్రానికి రావడం.. ఆధార్ అవసరమైతే ఏదైనా మార్పు కోసం వెంటనే ఇల్లెందు వెళ్లాల్సిన పరిస్థితి.

– మోకాళ్ల అనీల్, చెట్టుపల్లి

రోజూ తిరగలేకపోతున్నాం..

మా మండలంలో ఆధార్ సెంటర్ లేక ఇల్లందు పోవాలంటున్నారు. అంతదూరం వెళ్లినా సకాలంలో పని కావడం లేదు. మరో రోజు పోవాల్సి వస్తోంది. ఇక్కడే సెంటర్ ఏర్పాటు చేస్తే మా బాధలు పోతాయి.

– ఇర్ప ఉపేందర్, సాయనపల్లి

జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ప్రభుత్వ కార్యాలయాలకు ఇంకా ఆధార్ సెంటర్లు ఇవ్వలేదు. గతంలోఆధార్ సర్వీస్ నడపాలన్నారు. కానీ మా కార్యాలయం ప్రస్తుతం నిర్మాణంలో ఉంది. మండలంలో ఆధార్ సర్వీసును ఏర్పాటు చేయాలని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– తహసీల్దార్, నాగదివ్య

డ్రెయిన్ల నిర్మాణానికి రూ.3 కోట్లు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని జూలూరుపాడురోడ్డుకు ఇరువైపులా సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.3 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు ప్రకటించారు. స్థానిక రైతువేదికలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా మంజూరైన 61 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సదరు నిధులతో ప్రధానసెంటర్ నుంచి గ్రామశివారులో ఉన్న లంకలవాగు వరకు డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు, ఎస్డీ రసూల్, సర్పంచ్‌లు కుమారి, రణ్యా, ఎంపీటీసీలు లంకా విజయలక్ష్మి, రాజీ, నాయకులు మెడా మోహన్‌రావు, నాగరాజు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి విమర్శలు అర్థరహితం

ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రభుత్వంపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేస్తున్న విమర్శలు అర్థరహితమని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రం చంద్రుగొండలోని టీఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు దార వెంకటేశ్వరరావు ఇంట్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్‌రెడ్డి చేస్తున్న విమర్శలను ఖండిస్తూ.. అశ్వారావుపేటలో ఇప్పటికే రెండు పామాయిల్ ఫ్యాక్టరీలు ఉండగా, రూ.150 కోట్లతో మరో ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 10 వేల మంది గిరిజనులకు 50 వేల ఎకరాలకు సంబంధించి పోడు పట్టాలు పంపిణీ చేశామన్నారు. పోడుభూముల్లో బోరుబావుల నిర్మాణాలతోపాటు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో నాయకులు దార వెంకటేశ్వరరావు, మెడా మోహన్‌రావు, నల్లమోతు వెంకటనారాయణ, సత్తి నాగేశ్వరరావు, సూరా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో భరోసా


చెక్కు అందజేస్తున్న విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: దీర్ఘకాలిక అనారోగ్యాల కారణంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే బాధిత నిరుపేదల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి భరోసాగా నిలుస్తోందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మణుగూరుకు చెందిన జె.పాపమ్మకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.35 వేల చెక్కును రేగా కాంతారావు మంగళవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యాల పాలై ఆస్పత్రుల్లో చికిత్సలు పొందలేని ఎంతోమంది పేదల పాలిట వరం ముఖ్యమంత్రి సహాయనిధి అన్నారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అడపా అప్పారావు, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి నవీన్, నాయకులు యాదగిరిగౌడ్, శ్రీనివాస్, ఎం.కృష్ణ, జావిద్ పాషా, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని ఇన్‌చార్జ్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని మారుతి నర్సింగ్ కళాశాలలో మండల లీగల్ సర్వీస్ అథారిటీ నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో తెలంగాణ రాష్ట్ర ర్యాగింగ్ నిరోధక చట్టం 1997పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం అధ్యక్షత వహించగా.. ఇన్‌చార్జ్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. దేవదానం మాట్లాడుతూ.. ర్యాగింగ్ అనేది రాక్షసత్వానికి పరాకాష్ట అని, వ్యక్తి స్వేచ్ఛను హననం చేయడమేనని అన్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు ఎం.తరుణి, సహాయ కార్యదర్శి సంకా నర్మద, కల్చరల్, క్రీడా కార్యదర్శి పామరాజు తిరుమలరావు, పట్టణ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి, న్యాయవాదులు వలవల సురేష్, బోరం రామకష్ణ, కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ ఎస్ఎల్ కాంతారావు, ప్రిన్సిపల్, అధ్యాపక బందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆత్మ పరిశీలన చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్

భద్రాచలం: ఎమ్మెల్యే పొదెం వీరయ్యను విమర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సరెళ్ల నరేష్ అధ్యక్షతన జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అహర్నిశలు భద్రాచలం నియోజకవర్గం సమస్యలపై శ్రమిస్తూ, అసెంబ్లీలో ప్రస్తావిస్తున్న వీరయ్యను విమర్శించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ భద్రాచలం ప్రాంతంపై ప్రేమ ఉంటే బీఆర్ఎస్ నాయకులు.. కేసీఆర్ ఇస్తానని హామీ ఇచ్చిన నిధులు విడుదల చేయించారా అని ప్రశ్నించారు. ఆ పార్టీ నాయకత్వంలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి ఏంటో తెలియచేయాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, దొడ్డిపట్ల సత్యలింగం, సరెళ్ల వెంకటేష్, సుధీర్, యాడారి ప్రదీప్, రాస మల్లరాము, నిట్ట రాజు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు పందాల సరిత, ఒంగోలు దేవకి, గౌరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలమ్మ జాతర


అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరంలో మంగళవారం పోలమ్మ తల్లి జాతర ఘనంగా సాగింది. ఉదయం ఉదయం అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళస్నానాలు చేయించారు. గ్రామంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని పోలమ్మ వృక్షం వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడ మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులు పూనకాలతో ఊగిపోయారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, గుడ్ల తాతారావు, దల్లి హరిబాబు, రాజు, అచ్చి శ్రీనివాసరెడ్డి, అప్పన్న, మద్ది రాము తదితరులు పాల్గొన్నారు.

ఒకే రహదారిపై రెండు ప్రమాదాలు


మొండికుంట గ్రామ శివారులో అధ్వానంగా ప్రధాన రహదారి

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన సాదం ప్రవీణ్‌రెడ్డి సోమవారం రాత్రి బైక్‌పై నుంచి అదుపుతప్పి గాయలపాలయ్యాడు. మొండికుంట గ్రామ శివారులో మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై గుంతల వల్ల బైక్ అదుపు తప్పి కింద పడడంతో ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకురాలు పోలెబోయిన శ్రీవాణి పినపాక వస్తుండగా సంఘటనా స్థలంలో ఆగి 108కు ఫోన్ చేసి క్షతగాత్రుడుని ఆస్పత్రికి తరలించారు. ఆపై స్థానికులకు సమాచారం అందించారు.

మరోవైపు మొండికుంట గ్రామ శివారులో అటవీ ప్రాంతంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తికి గాయాలయ్యాయి. మణుగూరుకు చెందిన డేగల రాము బైక్‌పై మణుగూరు వెళ్తుండగా రహదారిపై గుంతలతో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. రాముకు చేయి విరిగి తీవ్ర గాయాలయ్యాయి. 108లో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ప్రాణాపాయంగా గుంతలు...

పైన తెలపిన రెండు ప్రమాదాలూ మండల పరిధిలోని మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై జరిగినవే. మొండికుంట గ్రామం నుంచి భద్రాచలం క్రాస్ రోడ్డు వరకు ఈ రహదారి గుంతలమయమై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. 24 గంటల్లో జరిగిన రెండు ప్రమాదాలూ గుంతలు మూలంగానే చోటుచేసుకున్నాయి. గుంతల కారణంగానే ఏప్రిల్ 18న ఆర్టీసీ బస్సు, డీసీఎం ఢీకొని పలువురు గాయపడ్డారు. గతంలో ఎందరో గాయాలపాలయ్యారు. పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇంత జరుగుతున్నా.. ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలు పూడ్చడం లేదు. ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

నులిపురుగుల నిర్మూలనపై అవగాహన

అన్నపురెడ్డిపల్లి: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై ఎర్రగుంట పీహెచ్‌సీలో మండల వైద్యాధికారిణి డా.ప్రియాంక ఆధ్వర్యంలో ఆరోగ్య, విద్యా, అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 20వ తారీఖు నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో 1–19 సంవత్సరాల పిల్లలకు ఆల్‌బెండజోల్‌ను తాగించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పూలమ్మ, డీపీఎంఓ వెంకటేశ్వరరావు, హెచ్‌ఈఓ కృష్ణయ్య, ఆశాలు తదితరులు పాల్గొన్నారు

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: చదువు కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న అటుకూరి బిందుమాధవి అనే విద్యార్థినికి శ్రీమంత్‌రెడ్డి ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రూ.5 వేలను నిర్వాహకులు ఎస్.వెంకటేశ్వరరెడ్డి ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో బి.సుబ్బారెడ్డి, బి.రమణకుమార్, ఐ.వెంకటేశ్వర్లు, పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటికి సన్మానం

అశ్వాపురం: గాంధీభవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మంగళవారం గాంధీభవన్‌లో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుక్కూరి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, శ్రీనివాసరావు దంపతులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు.

వైద్య శిబిరం

మణుగూరురూరల్: మండల పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన రేగులగండిలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో గ్రామస్తులకు వైద్య సిబ్బంది పరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. సర్వేలో భాగంగా ప్రతి ఒక్కరి ఇంటి పరిసరాలను పరిశీలించారు. నీరు నిల్వ ఉన్న కంటైనర్లను శుభ్రం చేయించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు రాంప్రసాద్, ఉమేస్, ఏవీ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ ఇందిర, ఆశా కార్యకర్తలు శారద, నీల, లీల తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణ శిబిరం

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మాతాశిశు సంరక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. చిన్నపిల్లల తల్లులు, గర్భిణులకు కొత్తగూడెంకు చెందిన వైద్యుడు ఆరకల భాస్కర్‌రావు వైద్యపరీక్షలు చేశారు. 0–5 సంవత్సరాల వయసున్న పిల్లల సంరక్షణ, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. శిశువుకు తల్లిపాలే తాగించాలని, ప్రధానంగా ముర్రుపాలు పట్టడం ఆరోగ్యకరమని అన్నారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ కనకం తనుజా, డాక్టర్ పోసాని సరోజిని, రోటరీక్లబ్ సెక్రటరి, పి.సుజాత, పాఠశాల హెచ్‌ఎం ఉండేటి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి


టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న రోశిరెడ్డి

భద్రాచలం: భద్రాచల సీతారామ చంద్రస్వామి దేవస్థాన అభివృద్ధికి టీటీడీ తరుపున సహకరించాలని దేవస్థాన మాజీ ట్రస్ట్ బోర్డు మెంబర్ ఎడమకంటి రోశిరెడ్డి టీటీడీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డిని కోరారు. మంగళవారం విజయవాడలో చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి స్వామి వారి ప్రసాదాలతో పాటుగా జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా భద్రాచలంలో రామాలయ అభివృద్ధికి టీటీడీ తరుపున సహాయ సహకారాలు చాలా అవసరమని వివరించారు. స్పందించిన చైర్మన్ అభివృద్ధి పనులకు సాయమందిస్తానని చెప్పినట్లు రోశిరెడ్డి తెలిపారు.

పలుగు, పార పట్టిన సర్పంచ్


పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనుల్లో సర్పంచ్ అశోక్

అశ్వాపురం: గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ పంచాయతీలో తాగునీరు సరఫరా అయ్యే మిషన్ భగీరథ పైపులైన్ గత ఆరు రోజులుగా లీకవుతోంది. గ్రామాల్లో అంతరంగిక సరఫరా, నిర్వహణ బాధ్యతలు పంచాయతీ పరిధిలోనే ఉన్నాయి. దీంతో నీటి సమస్యతో ప్రజల ఇబ్బందులు పడకుండా గ్రామ సర్పంచ్ కాక అశోక్ పలుగు, పార పట్టి పనులు చేశారు. పంచాయతీ కార్మికుల సమ్మెతో సర్పంచ్‌లు కార్మికుల అవతారమెత్తి ప్రజలకు సేవలు అందిస్తున్నారు.

వర్షాలు కురవాలని పూజలు

అశ్వాపురం: వర్షాలు సమృద్ధిగా కురవాలని మండల పరిధిలోని మొండికుంట గ్రామపంచాయతీకి చెందిన రైతులు, ప్రజలు మంగళవారం తుమ్మలచెరువు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి 101 బిందెలతో జలాభిషేకం చేశారు. వర్షాలు కురవాలని తుమ్మల చెరువు నిండాలని, పంటలు పండాలని వేడుకున్నారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మర్రి మల్లారెడ్డి, కోడి కృష్ణవేణి, గొర్రెముచ్చు వెంకటరమణ, ఉపసర్పంచ్ సుధీర్, ఎంపీటీసీ కమటం నరేష్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, మాజీ ఎంపీపీలు కొల్లు మల్లారెడ్డి, ఊసా అనిల్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మణుగూరురూరల్: భారీ వర్షాలు కురియనున్న నేపథ్యంలో పినపాక నియోజకవర్గం, మణుగూరు మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. వాతావరణశాఖ హెచ్చరికల మేరకు రానున్న మూడు రోజులు వర్షాలు కురుస్తాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, నీటిపారుదలశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

ఏరియా జీఎంకు వినతి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ ప్రతీ నెల 7వ తేదీలోగా వేతనాలు చెల్లించేలా చొరవ తీసుకోవాలని కోరుతూ ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు మంగళవారం ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించడంతో పాటు సీఎంపీఎఫ్ లోన్ సౌకర్యం కల్పించాలని, అత్యవసర పరిస్థితుల్లో విధులకు రాని కార్మికుల నుంచి వసూలు చేస్తున్న ఫైన్‌ను అరికట్టాలని జీఎంను కోరారు. పి.వీరభద్రం, జాన్, శ్రీను, రవి, కిరణ్ పాల్గొన్నారు.

జీపీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి


గుండాల: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు

గుండాల: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు యాసారపు వెంకన్న, కొమరం శాంతయ్యలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రామనాథం, సంపత్, రామారావు, రామూర్తి, బాటన్న, లక్ష్మీనర్సన్న, అనీల్, నాగేశ్వారావు, రాజేష్, ప్రవీణ్ వినోద్, రవీందర్, భోదారావు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని పంచాయతీ కార్మికులు పలు సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు అందజేశారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల పంచాయతీ కార్మికులు తాటిసుబ్బన్నగూడెం గ్రామంలోని ఎమ్మెల్యే నివాసానికి భారీ సంఖ్యలో చేరుకున్నారు. సమస్యలను వివరించి వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

భద్రాచలంఅర్బన్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 13వ రోజు సమ్మె శిబిరాన్ని సీపీఎం పట్టణ కమిటీ ప్రారంభించగా.. స్వామి మాట్లాడారు. పార్టీ పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకట రామారావు, నాదెళ్ల లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు డి.సీతాలక్ష్మి, కోరాడ శ్రీనివాస్, కుంజా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం కార్మికులు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి భారీ ప్రదర్శనగా భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల గ్రామపంచాయతీ కార్మికులు ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యే పోదెం వీరయ్యకు వినతిపత్రం అందించారు. పరిష్కారం కోసం సంబంధిత మంత్రికి లేఖ రాస్తానని, కార్మికుల పక్షాన అసెంబ్లీలో మాట్లాడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.